సాక్షి
మంచిర్యాల
మంగళవారం : 15 : ఏప్రిల్ : 2025



అటకెక్కిన అమరుల సంక్షేమం
ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు 2024లో ఇళ్లస్థలాలకు సంబంధించిన హక్కు పత్రాలు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 8లో▸



కేవీలో తరగతులు ప్రారంభం
గుడిపేటలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం నూతన భవనంలో సోమవారం తరగతులు ప్రారంభమయ్యాయి. సరస్వతీ పూజ చేసి తరగతులు ప్రారంభించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.0 /26.0
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడగాలులు బలంగా వీస్తాయి. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి యుడైస్ ప్లస్‌పై సర్వే



శిక్షణ ఇస్తున్న అధికారులు

మంచిర్యాలఅర్బన్: యుడైస్ ప్లస్‌లో నమోదు చేసిన మేరకు పాఠశాలల్లో విద్యార్థులున్నారా..? ఎక్కువ మందిని అంకెల్లో చూపుతున్నారా..? అనే అంశాలపై మంగళవారం నుంచి సర్వే కొనసాగనుంది. ఈ నెల 21 వరకు 708 పాఠశాలల్లో డీఈడీ, బీఈడీ విద్యార్థులు 70 మంది క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఒక్కో విద్యార్థి రోజుకు రెండు చొప్పున 10 పాఠశాలలను క్షేత్రస్థాయి తనిఖీ చేస్తారు. పాఠశాలల్లోని వాస్తవ పరిస్థితుల వివరాలన్ని యుడైఎస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేశారా..? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది రిపోర్టులో నమోదు చేసిన వివరాల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేసి ధ్రువీకరిస్తారు. తప్పులుంటే సరిచేయాలని హెచ్‌ఎంలకు రిమార్క్ రాసి ఇవ్వనున్నారు. యుడైఎస్‌లో నమోదు చేసే వివరాల ఆధారంగా పాఠశాలలకు బడ్జెట్ కేటాయిస్తుంటారు. స్థానిక ఎస్ఆర్‌కేఎం డైట్ కళాశాలలో సోమవారం యుడైఎస్ ప్లస్ సర్వే నిర్వహణపై మంచిర్యాల ఎస్ఆర్‌కేఎం డైట్ కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు, కుమురంభీం ఆసిఫాబాద్ డైట్ కళాశాల నుంచి 30 విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పలు అంశాలపై నిర్వహించే సర్వేపై సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఏఎస్‌సీ రాజ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: అగ్ని ప్రమాదాల నివారణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డితో కలిసి వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత భారతాన్ని నిర్మాద్దామని అన్నారు. రోజువారీగా వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

'అంబేడ్కర్ రాజ్యాంగంతోనే సంక్షేమ ఫలాలు'



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను పార్టీ జిల్లా మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, బోయిని హరికృష్ణ, పురుషోత్తం జాజు, బియ్యాల సతీశ్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, రాపర్తి వెంకటేశ్వర్లు, నాగుల రాజన్న, జోగుల శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజాపాలన తీసుకొచ్చాం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం విక్రమార్క, వేదికపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పీఎస్సార్, బొజ్జు



బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరైన నియోజకవర్గ ప్రజలు

- ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మంచిర్యాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలటౌన్: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు ప్రజాపాలన తీసుకొచ్చామని, ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మంచిర్యాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఐబీ ఆవరణలో మాతాశిశు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఐబీ నుంచి ఆర్పీ రోడ్డు మీదుగా ముఖరం చౌరస్తా, అర్చన టెక్స్ చౌరస్తాల మీదుగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు పాదయాత్రగా వచ్చి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తాను మార్చి 16, 2023లో పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించానని, అదే ఏడాది ఏప్రిల్ 14న మంచిర్యాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను పిలిపించామని తెలిపారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ఏంటో తెలిసిందని, మొదటి నుంచి పార్టీకి అండగా ప్రేమ్‌సాగర్‌రావు నిలిచారని, ఆయనకు కార్యకర్తలు తోడుగా నిలుస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో మంచిర్యాలలోని మాతాశిశు ఆసుపత్రిని గోదావరి ఒడ్డున కట్టవద్దని చెప్పినా వినకపోవడంతో అక్కడే నిర్మించడం వల్ల వరదల్లో మునిగిపోయిందని తెలిపారు. నాడే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎంసీహెచ్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఐబీ ఆవరణలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గోదావరి నది వరదతో రాళ్లవాగు ఉప్పొంగి ఈ ప్రాంతం మునిగిపోతుందని, కరకట్ట నిర్మించాలని నాడు ప్రజలు కోరారని, వారి కోరిక మేరకు కరకట్టను నిర్మిస్తున్నామని అన్నారు. తన నియోజకవర్గం మధిర అంటే తనకెంత ఇష్టమో మంచిర్యాల నియోజకవర్గమన్నా అంతే ఇష్టమని, ఇక్కడి కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేస్తారని ప్రశంసించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి సాగు, తాగునీరు అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపి వేసిన ప్రాజెక్టును ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ.765 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు.



నివాళులర్పించి నినాదాలు చేస్తున్న డిప్యూటీ సీఎం విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



హెలీప్యాడ్ వద్ద 'భట్టి'కి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు



అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటున్న 'భట్టి', పీఎస్సార్

మంచిర్యాలలో ఐటీ పార్కుకు నిధులు



మంచిర్యాలలో ఐటీ పార్కుకు నిధులు కేటాయించాం. పారి శ్రామికంగా అభివృద్ధి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నా మంథని నియోజకవర్గంలోనూ ఇన్ని నిధులు, అభివృద్ధి పనులు చేయలేదు. కానీ మంచిర్యాలలో మాత్రం అభివృద్ధిని ప్రేమ్‌సాగర్‌రావు వేగవంతంగా చేస్తున్నారు. నా సహకారం మంచిర్యాలకు ఉంటుంది. పనిచేసే ఎమ్మెల్యే ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం.
– పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



ప్రతీయేటా 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. వేలాది మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులు చాలామంది ఉన్నారు. నాలుగేళ్లకు సరిపడా అర్హులను గుర్తించి, వారిలో అత్యంత పేద వారికి ఏడాది చొప్పున ఇళ్లను మంజూరు చేస్తుండాలి. రాజీవ్ యువ వికాస్ కోసం నిరుద్యోగులు వేలాదిగా దరఖాస్తు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 10 వేల మందికి వెంటనే మంజూరు చేయాలి. అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అండగా నిలిచారు. ప్రజలు సహకరించడంతోనే నేను ఎమ్మెల్యేగా గెలుపొందాను. కన్నతల్లి రుణం తీర్చుకోలేనిది.. ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత దూరమైనా వెళ్లి అభివృద్ధి పనులు చేస్తాను. 76 ఏళ్లుగా ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరిగింది. ఆదివాసీల గొంతుకగా మారిన నన్ను పార్టీ విస్మరించదని భావిస్తున్నాను.
– కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

ఇందిరమ్మ రాజ్యం వచ్చింది..

రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా కొనసాగుతోంది. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని విధ్వంసం చేసే కుట్ర చేస్తున్న వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పిన వారే నేడు అంబేడ్కర్ జయంతి రోజు పూలమాల వేస్తున్నారు.. వారికి ఆ అర్హత లేదు.
– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం

కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, ప్రజల వద్దకు వెళ్లి రాజ్యాంగాన్ని మారుస్తున్న అంశాలను ప్రజలకు వివరించి, అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం. ఇందుకోసం ప్రతీ గ్రామం, వార్డుల్లోని కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతగానో కృషి చేశారు. విజయవంతంగా పాదయాత్రలు నిర్వహించాం.
– కొక్కిరాల సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు

మొదటి స్థానంలో మంచిర్యాల

కాంగ్రెస్ జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్లిన ఘనత మంచిర్యాల నియోజకవర్గానిదే. ఇందుకోసం ప్రతీ కార్యకర్త ఎంతగానో కష్టపడ్డారు. రాష్ట్రంలోనే పకడ్బందీగా కార్యక్రమాన్ని చేపట్టిన వాటిలో మంచిర్యాల ఉంది.
– రుద్ర సంతోశ్, జైబాపు, జైభీం, జైసంవిధాన్ కోఆర్డినేటర్

రూ.765 కోట్ల అభివృద్ధి పనులు



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో చేపట్టిన, చేపట్టబోయే రూ.765 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన 22 శిలాఫలకాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంచిర్యాలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఆవిష్కరించారు. రూ.256 కోట్లతో కార్మెల్ పాఠశాల నుంచి గోదావరి వరకు రాళ్లవాగుకు కరకట్ట నిర్మాణానికి శంకుస్థాపన, రూ.195 కోట్లతో రోడ్లు భవనాల శాఖ పరిధిలో 4 పనులు, మున్సిపల్ శాఖలో రూ.30 కోట్లతో పనులు, ఎన్‌పీడీసీఎల్ శాఖ పరిధిలో రూ.32 కోట్లతో 4 పనులు, పంచాయతీరాజ్ పరిధిలో దాదాపుగా రూ.17 కోట్లతో 2 పనులు, టీజీఈడబ్ల్యూఐడీసీ పరిధిలోని 31 పాఠశాలల్లో రూ.12.50 కోట్లతో పనులు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో రూ.13 కోట్లతో, సింగరేణి పరిధిలో రూ.12 కోట్లతో 2 పనుల శిలాఫలకాలను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అటవీశాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పట్టేదారులం

- ప్రేమ్‌సాగర్‌రావు విమర్శలు తగదు
- వివేక్ మంత్రి పదవి ఆశించడంలో తప్పులేదు
- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: 'మాది కాక కుటుంబం.. కాంగ్రెస్‌కు పట్టేదారులం.. మా కుటుంబం నిన్నామొన్న రాజకీయాల్లోకి రాలేదు.. డెబ్బై ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నాం.. ఇందిరాగాంధీని జైలు నుంచి మా నాన్న వెంకటస్వామి బయటకు తెచ్చారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి భవనాన్ని ఇచ్చింది మా కుటుంబమే. రాజకీయాల్లో అంతటి చరిత్ర కలిగిన మా కుటుంబంపై ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు విమర్శలు చేయడం తగదు..' అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వ్యాఖ్యానించారు. సోమవారం రాత్రి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై తామెప్పుడు ఎలాంటి ఆరోపణలు చేయలేదని, ఆయనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకున్నది కూడా ఏమీ లేదని స్పష్టం చేశారు. అధిష్టానాన్ని ఒప్పించి 2006–07లో ప్రేమ్‌సాగర్‌రావుకు ఎమ్మెల్సీ ఇప్పించిన ఘనత తమదని అన్నారు. మంత్రి పదవి ఇచ్చేది కాంగ్రెస్ అధిష్టానమని, తమ చేతుల్లో ఏముంటుందని ప్రశ్నించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఘనత తమ కుటుంబానికి దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ కుటుంబం గురించి కాంగ్రెస్ పార్టీకి పట్టెదారులుగా ప్రకటించిన సంగతి తెలిసిందేనన్నారు. సీనియర్ ఎమ్మెల్యేగా మంత్రి పదవి కావాలని తాము కోరుకోవడంలో తప్పు లేదన్నారు. తమ తమ్ముడు కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారని, అందులో తప్పేముందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మత్తమారి సూరిబాబు, ముచ్చర్ల మల్లయ్య, కంకటి శ్రీనివాస్, సింగతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా గొంతును

- నా గొంతు నొక్కితే ఊరుకోం
- నిన్న మొన్న వచ్చి మంత్రి పదవి అడుగుతున్నారు
- బహిరంగంగానే బాధను వెల్లగక్కిన పీఎస్సార్
- ఆ మాటలపై స్పందించని డిప్యూటీ సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'గత 76ఏళ్లుగా ఉమ్మడి జిల్లాకు అన్యాయమే జరుగుతోంది. గత 25ఏళ్లుగా ఆదివాసీ, గిరిజన, మైనార్టీల గొంతుగా ఉన్న. నిన్న మొన్న వచ్చినోళ్లు మంత్రి పదవి అడుగుతున్నారు. ఇప్పుడు గొంతు నొక్కాలని చూస్తున్నారు. ఒక్కటీ గుర్తు పెట్టుకోండి. నాకు మాటిచ్చారు. ఎవరికి ఇచ్చినా నాకు బాధ లేదు. ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరిగితే ఊరుకోం. పార్టీ కష్టకాలంలో పని చేశా. ఇంద్రవెల్లి, మంచిర్యాలలో బహిరంగ సభలు ఎవరు పెట్టారు? పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఏడు రోజులు జరిగితే ఏడు నిమిషాలు కూడా రాలే. ఇది ఉద్యమాల గడ్డ. బీఆర్ఎస్, బీజేపీల నుంచి తిరిగిన వారికి మంత్రి పదవి ఇచ్చి, నా గొంతు నొక్కాలని చూస్తే వాళ్ల గొంతుగా ఉన్న నేను ఏం చేయడానికైనా సిద్ధమే' అంటూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయంగా చర్చకు తెరలేపింది. అయితే మంచిర్యాలలో సోమవారం జరిగిన బహిరంగ సభలో పీఎస్సార్ ఆవేదనగా మాట్లాడినప్పటికీ వేదికపై ఉన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు స్పందించకపోవడం గమనార్హం.

పొరుగు ఎమ్మెల్యేల పోటీ

ఉమ్మడి జిల్లా నుంచి గత ఏడాదిన్నరగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యమే లేదు. ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క కొనసాగుతున్నారు. 'మాల' కోటాలో గడ్డం వివేక్‌కు కేబినెట్ బెర్తు దాదాపు ఖరారైందని ఉగాదికి ముందు ప్రచారంలోకి వచ్చింది. కానీ విస్తరణకు మళ్లీ బ్రేక్‌పడింది. అంతకుముందు పీఎస్సార్‌కు బెర్త్ ఖాయంగా చెప్పుకున్నారు. మారుతున్న సమీకరణాలతో పీఎస్సార్‌ను పక్కకు పెడుతున్నారా? అనే సందేహాలు మొదలయ్యాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మంచిర్యాల ఎమ్మెల్యేకు సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. తనకు కేబినెట్‌లో చోటు గ్యారంటీ అనుకున్న పీఎస్సార్‌కు పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో అనుకోని విధంగా పోటీ ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ నుంచి పార్టీలోకి వచ్చిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, అంతకు ముందు బీఎస్పీ నుంచి వచ్చిన మాజీ మంత్రి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మంత్రి పదవి రేస్‌లో ఉండడం పీఎస్సార్ వర్గానికి మింగుడు పడడం లేదు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ టికెట్ వంశీకృష్ణకు అధిష్టానం ఖరారు చేయడం, గెలుపొందడం జరిగాయి. ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి పదవులు రావడంతో తనకు మంత్రి పదవి ఢోకా లేదనే అనుకున్నారు. తీరా అన్నదమ్ములు ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పి ఒకరికి బెర్త్ ఖరారు చేసుకున్నారనే ప్రచారం మొదలైంది. తనకు నష్టం జరుగుతుందేమోనని ఆప్తులైన డిప్యూటీ సీఎం, మంత్రి ముందు మనసులోని ఆవేదనను బయటపెట్టారని పీఎస్సార్ అనుచరులు చెబుతున్నారు.

తొలిసారిగా బహిరంగ వేదికగా

మరోవైపు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, ఎంపీ వంశీకృష్ణపై పరోక్షంగా ప్రస్తావిస్తూ ఇప్పటికే ఆ కుటుంబానికి మూడు పదవులు ఇచ్చారని, జిల్లాను దత్తత చేస్తే అప్పుడు తెలుస్తుందని ఘాటుగానే మాట్లాడారు. వేదికపైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో సహా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అదే సమయంలో సభలో ఉన్న పార్టీ నాయకులు 'జై పీఎస్సార్', పీఎస్సార్‌కు మంత్రి పదవి ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. దళిత సంఘాల నాయకులు సైతం సభ ముగిసి వెళ్లే సమయంలోనూ పీఎస్సార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని 'భట్టి'ని కోరారు.

అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్



చెన్నూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వివేక్



పూలమాలలు వేస్తున్న ఎంపీ వంశీకృష్ణ



కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్



జైపూర్‌లో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి



జై భీం..

చెన్నూర్/బెల్లంపల్లి/లక్సెట్టిపేట/భీమారం: జిల్లాలో అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూర్, రామకృష్ణాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. రాజ్యాంగం ఫలితంగానే ఈ రోజు దళితులకు రిజర్వేషన్లు, మహిళలకు 50శాతం రిజర్వేషన్లు లభిస్తున్నాయని తెలిపారు. బెల్లంపల్లిలోని శాంతిఖని గని, రడగంబాలబస్తీ, కాంటా చౌరస్తా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంచిర్యాలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఉత్కూరు చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో ఈడీ చిరంజీవి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక ఒకరు బలవన్మరణం

భైంసారూరల్(ముధోల్): కడుపునొప్పి భరించలేక ఒకరు బలవన్మరణం చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన కల్యాణ్కర్ తానాజీ (31) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. సోమవారం కడుపులో నొప్పి ఎక్కువ కావడంతో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన గణేశ్

ఉట్నూర్రూరల్: మండలంలోని పులిమడుగు వద్ద ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంద్రవెల్లి మండలంలోని నందునాయక్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ గోతి గణేశ్ సోమవారం ఉట్నూర్ వైపు నుంచి ఇంద్రవెల్లికి వెళ్తుండగా పులిమడుగు గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీ కొట్టింది. గణేశ్కు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఆదిలాబాద్లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తా సమీపంలో నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హన్మాండ్లు (45) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామానికి చెందిన హన్మాండ్లు అతివేగంగా ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్కు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. మృతునికి భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో అపశ్రుతి


హోర్డింగును తొలగిస్తున్న సిబ్బంది

నస్పూర్: జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనలో చిన్న అపశ్రుతి చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం నస్పూర్ కలెక్టరేట్లోని హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. హెలికాప్టర్ ఫ్యాన్ గాలికి హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్ విరిగి డిప్యూటీ సీఎం కాన్వాన్లోని వాహనంపై పడింది. వాహనంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తదనంతరం సిబ్బంది వాహనంపై పడిన హోర్డింగును తొలగించారు.

అటకెక్కిన అమరుల సంక్షేమం

భూమి కోసం...భుక్తి కోసం...హక్కుల సాధనకోసం చేసిన పోరాటంలో 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులైన 15 మంది ఆదివాసీల కుటుంబ సభ్యులకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పించింది. గతేడాది ముఖ్యమంత్రి హోదాలో ఇంద్రవెల్లికి వచ్చిన రేవంత్రెడ్డి అమరుల కుటుంబ సభ్యులకు ఇళ్లస్థలాలకు సంబంధించిన హక్కుపత్రాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. కానీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పనులు ముందుకు సాగడంలేదు.

- హక్కు పత్రాలు ఇచ్చారు.. ఇళ్ల నిర్మాణం మరిచారు
- ఇళ్ల స్థలాలు స్వయంగా అందించిన సీఎం
- ఏడాదైనా నిర్మాణ పనులు మొదలు పెట్టని వైనం..
- లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద 2021 ఆగస్టు 9న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత..గిరిజన దండోర సభ ఏర్పాటు చేశారు. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్రెడ్డి హాజరుకాగా సభ సక్సెస్ కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింతా ఉత్సాహం తీసుకొచ్చింది. ఈ సందర్భంగా రేవంత్రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆదివాసీలపై కాల్పులు జరిగాయని, తెలంగాణలో అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా గుర్తింపు తీసుకురావడంతో పాటు అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2024లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదేశాలతో అధికారులు ముత్నూర్ గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించి లేఅవుట్ వేశారు. 2024 ఫిబ్రవరి 2న తొలిసారిగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి స్మృతివనం పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించడంతో పాటు ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు పూర్తికావచ్చినా ఇప్పటికీ పనులు ముందుకు సాగడంలేదు. కేవలం లేఅవుట్ వేసి విద్యుత్ స్తంభాలు వేసిన అధికారులు ఇళ్ల నిర్మాణం మర్చిపోయారని అమరుల కుటుంబాలు, ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.


సీఎం చేతుల మీదుగా ఇళ్లస్థలాల హక్కుపత్రాలు అందుకున్న అమరుల కుటుంబ సభ్యులు (ఫైల్)

అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి



ఇంద్రవెల్లి అమరుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు అందించారు. కానీ ఇంటి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించలేదు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్లనిర్మాణం చేపట్టి అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి.

– పుర్క బాపురావ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

హక్కుపత్రాలకే పరిమితం



1981 ఏప్రిల్ 20న జరిగిన సభకు మానాన్న తొడసం భీంరావు కూడా వెళ్లాడు. పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరుడయ్యాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

– తొడసం హనుమంత్రావ్, అనంతపూర్

ఇంటి పెద్దదిక్కును కోల్పోయాం



1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసుల కాల్పుల్లో మా తాత మంగం ముత్తు అమరుడయ్యాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన మాకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిస్థలానికి హక్కుపత్రాలు ఇచ్చింది. కానీ ఇంటి నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి ఇంద్రవెల్లి అమరుల కుటుంబాల ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలి.

– మంగం అంకూస్, గౌరపూర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం



ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కలెక్టర్ ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున 15 కుటుంబాలకు రూ.75 లక్షల నిధులు మంజూరు చేశారు. మూడు రోజుల క్రితమే మార్క్ అవుట్ చేశాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– జీవన్రెడ్డి, ఎంపీడీవో, ఇంద్రవెల్లి

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

బాసర(ముధోల్): బాసరలోని శ్రీ వేదభారతి పీఠం ఆధ్వర్యంలో శ్రీ వేద పాఠశాల సంచాలన సమితి నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దామోదర్ రెడ్డి, అధ్యక్షుడిగా శ్యాంసుందర్ మాందానీ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ దిద్యాల, సెక్రెటరీగా డాక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ్, జాయింట్ సెక్రెటరీగా రాజేశ్బాబు, కోశాధికారిగా సుభాష్ ధరక్, సభ్యులుగా రవి పాండే, గుజ్జుల్వర్ వెంకటేశ్, గంటోల్ల సుదర్శన్, పోతిగంటి సతీశ్రావు, దయ్యాల లక్ష్మణ్రావు, నాగరాజు, శ్రీశైలం, దిలీప్, సిరం సంజీవరెడ్డి, ఉమ్మాయి సంజీవరావు, బిద్దూర్ రమేశ్, తుందత్తును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నారి కడుపులో బటన్ బ్యాటరీ


తొలగించిన బటన్ బ్యాటరీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు శ్రీరాంపూర్కు చెందిన మూడేళ్ల చిన్నారి కడుపులో నుంచి బటన్ బ్యాటరీని తొలగించిన ఘటన చోటు చేసుకుంది. వైద్యుడు సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్కు చెందిన చిన్నారి రెండు నెలలుగా మింగడంలో ఇబ్బంది పడుతుండడం, కడుపులో మంట, నొప్పితో బాధపడుతోంది. ఆదివారం ఎండోస్కోపి చేసి కడుపులో బటన్ బ్యాటరీ ఉన్నట్లు గుర్తించి బయటకు తీశామన్నారు. ఆలస్యమైతే ప్రాణాపాయ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యుడు సూచించారు.

నలుగురు దేశీదారు విక్రేతల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న దేశీదారు బాటిళ్లు

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) పంచాయతీ పరిధిలోని మండపల్లిలో నలుగురు దేశీదారు విక్రేతలను అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం మహారాష్ట్రలోని మాండ్వి నుంచి దేశీదారు తీసుకువస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు గ్రామశివారులో పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్, ఆశీష్ జైస్వాల్, కుంభేకర్ ప్రభాకర్, ఆత్రం కృష్ణను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 90 ఎమ్ఎల్ బాటిళ్లు 196 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఏఎస్సై ముంతాజ్, సిరాజ్, సిబ్బంది దినేశ్, మధుకర్, రవీందర్ పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి మృత్యుఒడికి..

- కారు బోల్తాపడి ఒకరు మృతి


సుమన్ (ఫైల్)

భైంసాటౌన్(ముధోల్): శుభకార్యం నిమిత్తం భైంసాకు వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నిర్మల్ మండలం లంగ్డాపూర్కు చెందిన సుమన్ (34) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. నిర్మల్లో ఫొటోగ్రాఫర్గా పనిచేస్తున్న సుమన్ ఆదివారం భైంసాలోని నేతాజీనగర్లో ఓ శుభకార్యం నిమిత్తం తన అల్లుడు సాయిచరణ్తో కలిసి కారులో వచ్చారు. సోమవారం పార్డి(బి) బైపాస్ మీదుగా నిర్మల్వైపు తిరిగి వెళ్తున్న క్రమంలో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుమన్ అక్కడికక్కడే మృతి చెందగా గాయాలపాలైన సాయిచరణ్ను అంబులెన్స్లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్కు తరలించినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలిని సీఐ గోపీనాథ్, ఎస్సై ఎండీ గౌసుద్దీన్ పరిశీలించారు.

రెక్కల కష్టం అగ్గిపాలు..

- అమ్ముకుందామనుకునేలోపే అగ్నిప్రమాదం
- బోరిగాంలో మూడు, మహాగాంలో రెండెకరాల్లో పంట దగ్ధం


బోరిగాంలో కాలిపోయిన మొక్కజొన్న పంట


మహాగాంలో దగ్ధమైన మొక్కజొన్న పంట

భైంసారూరల్(ముధోల్): చేతికి అందివచ్చిన మొక్కజొన్న పంటను అమ్ముకుందామనుకున్న ఆ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో అంతా చూస్తుండగానే మండలంలోని బోరిగాంలో మూడెకరాలు, మహాగాంలో రెండెకరాల్లో పంట కాలి బూడిదయ్యింది.

ట్రాన్స్ఫార్మర్ వద్ద మంటలు రావడంతో...

బోరిగాంకు చెందిన లఖన్పటేల్ మూడెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. ఇటీవల పంటను కోసి కుప్పగా వేశాడు. రెండు రోజులు వర్షాలు ఉండడంతో ఆగిపోయాడు. సోమవారం మధ్యాహ్నం హార్వెస్టర్తో పంటను నూర్పిడి చేయిద్దామని బయటకు వెళ్లాడు. పంట చేనులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద సాంకేతిక లోపంతో మంటలు చెలరేగి మొక్కజొన్న చేనుకు అంటుకుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అరగంటలోనే మంటలు వ్యాపించాయి. అంతా చూస్తుండగానే పంట కాలిబూడిదైంది. 120 క్వింటాళ్ల మొక్కజొన్న కళ్లముందే కాలుతుంటే రైతు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

పక్క చేనులో మంటలు వచ్చి...

మహాగాంకు చెందిన కారగిరి సాయినాథ్ రెండెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశాడు. సోమవారం హార్వెస్టర్తో పంట నూర్పిడి చేయించేందుకు సిద్ధమయ్యాడు. పక్క చేనులో పంట వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి చూస్తుండగానే రెండెకరాల మొక్కజొన్న పంట కాలిబూడిదైంది. సుమారు రూ.1.70 లక్షల నష్టం జరిగిందని రైతు వాపోయాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ అజయ్కుమార్

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంతో పాటు తర్లపాడ్లోని అగ్గి మల్లన్న ఆలయాల్లో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్ అజయ్ కుమార్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్నగర్కు చెందిన మనుపటి రాజుతో పాటు చందపెల్లికి చెందిన బొజ్జ రాజశేఖర్ ఈ నెల 9న రాత్రి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 500 గ్రాముల వెండితో పాటు 4 గ్రాముల బంగారం, రూ.9వేల నగదు, టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు


ఘటనస్థలంలో చిన్నారులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మందమర్రి మండలం బీజోన్కు చెందిన లగిశెట్టి తిరుపతి, స్వప్న దంపతులు, కూతురు ఆధ్య, కుమారుడు యశ్వంత్ సోమవారం బైక్పై బీజోన్ నుండి మంచిర్యాలకు బయలుదేరారు. ఏసీసీ సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ కిందపడడంతో ఆధ్య కాలు విరగగా యశ్వంత్కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో చిన్నారులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.

పిప్రిలో ఉద్రిక్తత


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్రావు

బజార్హత్నూర్(బోథ్): మండలంలోని పిప్రిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబేడ్కర్ అభిమాన సంఘం నాయకులు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కట్టిన పంచశీల జెండాలను రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి డ్రెయినేజీలో పడివేశారు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్ వాదులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్రావు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నేరం రుజువైతే నిందితులు ఎంతటివారైనా కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఏఎస్సై లింబాజీ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం సీఐ వెంకటేశ్వర్రావు గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

జొన్నపంట దగ్ధం


దగ్ధమైన జొన్న పంట

జార్హత్నూర్(బోథ్): మండల కేంద్రంలో సోమవారం విద్యుదాఘాతంతో రెండెకరాల్లో జొన్నపంట దగ్ధమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన కళ్లెం విఠల్, కళ్లెం నాగభూషన్ రెండెకరాల్లో జొన్నపంట సాగు చేశారు. తమ పంటచేలోంచి జాతర్ల పీడరుకు చెందిన 11 కేవి విద్యుత్ లైన్ వెళ్తుండగా సోమవారం వీచిన గాలి దుమారానికి విద్యుత్వైర్లు ఒకదానికి ఒకటి తాకడంతో మంటలు చెలరేగి ఎండిన జొన్నచేనుపై పడడంతో పంట దగ్ధమైంది. ఘటనలో రూ.1.20 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన మారుతి

కడెం(ఖానాపూర్): మండలంలోని పెద్దూర్ తండా వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలానికి చెందిన మారుతి సోమవారం కడెం నుంచి ఖానాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెద్దూరు తండా వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. ఘటనలో మారుతికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు అంబులెన్సులో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆర్జీయూకేటీలో అంబేడ్కర్ జయంతి వేడుకలు


చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ గోవర్ధన్

బాసర(ముధోల్): బాసర ఆర్జీయూకేటీలో బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్య, సమానత్వం, న్యాయ పరిరక్షణ రంగాల్లో అంబేడ్కర్ మార్గదర్శకతను గుర్తు చేశారు. విద్యే మార్పుకు మూలం అనే ఆయన అభిప్రాయం నేడు అందరినీ ప్రేరేపిస్తోందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో విశ్వవిద్యాలయంలో మహనీయుల పుస్తకాలను లైబ్రరీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో విద్యార్థుల్లో పుస్తక పఠనంతో పాటు జ్ఞానాన్ని సముపార్జించడానికి వేదిక అవుతుందన్నారు. పుస్తకం జీవితాన్ని మార్చే ఆయుధమని చెప్పిన అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, స్కిట్, డాన్స్, కవిత్వం, పోస్టర్ ప్రజెంటేషన్, తదితర పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్తో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డా.మహేష్, డా.విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం సాధించాలి


వేదికపై అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్రూరల్: తెలంగాణ గడ్డమీద బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం సాధించి రెడ్డి, వెలమలను అధికారంలోంచి దింపడమే అంబేడ్కర్కు ఇచ్చే జన్మదిన కానుక అని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర ప్రారంభ సభలో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పెషల్ స్టేటస్ ఫర్ తెలంగాణ ఈ బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో రాజ్యాధికారం సాధించేందుకు మహాశక్తిగా అవతరిస్తామన్నారు. రాజ్యాంగ హక్కులన్నీ సాధిస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్గౌడ్ మాట్లాడుతూ ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీని బలోపేతం చేద్దామన్నారు. లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాలు 670కి పైగా మండలాలు 12వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల మూడు నెలలపాటు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామయ్య యాదవ్, కుమారస్వామి, డీఎస్పీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ పాల్గొన్నారు.